


కలెక్టర్ ప్రత్యేక పూజలు

బాపట్ల: పట్టణంలోని శ్రీ భావన్నారాయణ స్వామి ఆలయాన్ని కలెక్టర్ జె.వెంకట మురళి శనివారం సందర్శించారు. స్వామికి పూజలు చేసి, ఆలయ చరిత్రను తెలుసుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 504.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: వడ్డవల్లి రామాలయం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

రెంటచింతలలో భారీ చోరీ

రూ. లక్ష నగదు, 92 గ్రాముల బంగారం అపహరణ



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో శుక్రవారం రాత్రి భారీ చోరీ ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని జెండాచెట్టు సమీపంలోని ఏరువ ప్రతాప్‌రెడ్డి ఈ నెల 19 శుక్రవారం ఉదయం 6.30 గంటలకు తెలంగాణ రాష్ట్రం హన్మకొండ పట్టణంలో వారి బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి కుటుంబ సమేతంగా వెళ్లారు. శనివారం మధ్యాహ్నం 12.40 గం.ల సమయంలో ఇంటిపక్కన వారు తలుపులు తీసి ఉండటం గమనించి విషయాన్ని ప్రతాప్‌రెడ్డికి తెలిపారు. రాత్రి 7 గం.ల సమయంలో ఇంటికి వచ్చిన ప్రతాప్‌రెడ్డి ఇంట్లోని రెండు బీరువాలను పగలగొట్టి నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గమనించి వెంటనే పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. ఘటనా స్థలానికి ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు, ఏఎస్‌ఐ హనుమంతురావులు వెంటనే చేరుకుని ఆ ఇంటి చుట్టుపక్కల వారిని విచారించి, వివరాలను సేకరించారు. అనంతరం బ్రహ్మయ్య బావి సెంటర్‌లో ఏర్పాటు చేసిన పలు సీసీ కెమెరాలను పరిశీలించారు. రూ. లక్ష నగదు, సుమారు రూ. 6.30 లక్షల విలువైన 92 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గుంటూరు నుంచి క్లూస్ టీంను పిలుపిస్తున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. ప్రతాప్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

నేడు పెదకాకానిలో శాకంబరీ ఉత్సవాలు



పెదకాకాని: ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భ్రమరాంబ అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలు, వివిధ రకాల పండ్లు, సుగంధ ద్రవ్యాలతో శాకంబరీదేవిగా ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు దేవస్థాన ఉపకమిషనర్, కార్యనిర్వహణాధికారి డి.శ్రీరామవరప్రసాదరావు శనివారం తెలిపారు. ముఖ మండపం, ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం, సోమవారం భ్రమరాంబ అమ్మవారు శాకంబరీ దేవి అలంకారంలో భక్తులు దర్శించుకోవటం కోసం అవకాశం ఉందని ఉపకమిషనరు తెలిపారు. ఆదివారం భక్తులకు అమ్మవారి దివ్య ప్రసాదంగా కదంబ ప్రసాదం వితరణ చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి



గుంటూరుఎడ్యుకేషన్: విద్యార్థులకు అంటువ్యాధులు ప్రబలకుండా పాఠశాలల యాజమాన్యాలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో శనివారం గుంటూరు నగర పరిధిలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను మలేరియా, డెంగీ తదితర అంటువ్యాధులపై అప్రమత్తం చేస్తూ విద్యాశాఖ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. మలేరియా, డెంగీ వంటి అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తల్లిదండ్రులతో సమావేశాలను నిర్వహించాలని పాఠశాలల యాజమాన్యాలను ఆదేశించారు. డీఈవో పి.శైలజ, జిల్లా ఎస్‌సీడీ ఇన్‌చార్జి గ్రావణ్‌బాబులు మాట్లాడారు. సమావేశంలో జిల్లా మలేరియా నియంత్రణాధికారి సుబ్బారాయణం, డీవైఈవో పి.వెంకటేశ్వరరావు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు బూరుగులమ్మ శాకంబరీ ఉత్సవాలు

రేపల్లె రూరల్: ఆషాఢ మాసం శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ఓల్డ్ టౌన్‌లో గల గ్రామదేవత బూరుగులమ్మ అమ్మవారి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు అర్చకుడు నందివెలుగు భానుసుధాకర్ తెలిపారు.

తొలగని వాన ముప్పు

ద్రోణి ప్రభావంతో జిల్లాలో భారీవర్షాలు

అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జడివానతో జనం బయట అడుగుపెట్టేందుకు జంకుతున్నారు. భారీ వర్షాలతో జిల్లాలోని వాగులు, వంకలు నిండి పొంగి పొర్లుతుండగా.. అమరావతి వద్ద మేళ్లవాగు ఉగ్రరూపం దాల్చడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. జోరువానకు పంటపొలాలు జలమయం కాగా.. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి.

- 24 గంటల్లో జిల్లాలో 44.76 మి.మీటర్ల వర్షం
- అత్యధికంగా అమరావతి మండలంలో 60.4 మి.మీ
- ఉగ్రరూపం దాల్చిన మేళ్లవాగు
- నీట మునిగిన పంటపొలాలు
- 20రోజుల వ్యవధిలోనే నెలరోజులను మించిన వర్షపాతం నమోదు
- మునురుతో స్తంభించిన జనజీవనం



అమరావతి వద్ద పొంగి ప్రవహిస్తున్న మేళ్లవాగు

నరసరావుపేట: పల్నాడు జిల్లావ్యాప్తంగా గడిచిన 24గంటల వ్యవధిలో 44.76మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు జిల్లాలోని 28 మండలాల్లోను వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా పడిన వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి. అమరావతి మండలంలో 60.4 మి.మీ వర్షం పడగా, అత్యల్పంగా వెల్దుర్తిలో 4.6 మి.మీ మాత్రమే కురిసింది. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో 15.6 మి.మీ వర్షం కురిసింది. మాచర్ల, దుర్గి మండలాల్లో 6.4, రెంటచింతలలో 16.4, గురజాలలో 10.6, దాచేపల్లిలో 8.8, కారంపూడి, నూజెండ్ల, పిడుగురాళ్లల్లో 9.2 మి.మీ వర్షం గురిసింది. మాచవరంలో 15.6, బెల్లంకొండలో 46.4, అచ్చంపేటలో 41, క్రోసూరులో 23.6, పెదకూరపాడులో 27.8, సత్తెనపల్లిలో 10.4, రాజుపాలెంలో 11.8, నకరికల్లులో 18.4, బొల్లాపల్లిలో 9.6, వినుకొండలో 8.6 మి. మీ వర్షం పడింది. అలాగే శావల్యాపురంలో 6.8, ఈపూరులో 10.4, రొంపిచర్ల మండలంలో 15.6, ముప్పాళ్లలో 9.2, నాదెండ్లలో 11.4, చిలకలూరిపేటలో 11.8, యడ్లపాడులో 12.2 మి.మీటర్ల వర్షం కురిసింది. కాగా, జిల్లాలో జూలై నెలరోజుల సాధారణ వర్షపాతం 236.56 మి.మీ వర్షం పడాల్సివుండగా గడిచిన 20రోజుల వ్యవధిలో 258.52 మి.మీ వర్షం కురిసింది.

దుర్గాదేవి గుడిలోకి వర్షం నీరు



నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలోకి చేరిన వర్షపు నీరు

దాచేపల్లి: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. గత మూడు రోజులుగా వర్షం కురుస్తుండటంతో వాగులు, కాలువలు పొంగి ప్రవహించాయి. శనివారం కురిసిన వర్షం ధాటికి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలోకి వర్షపునీరు చేరింది. ఆలయం సమీపంలోని మురికికాలువలు వ్యర్థాలతో నిండి ఉండటంతో నీరంతా ఆలయంలోకి వచ్చాయి. వర్షంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి.

ఉధృతంగా వాగులు



పొలాల్లో నిలిచిన వర్షపునీరు

అమరావతి: గత నాలుగురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని నరుకుళ్లపాడు, ఎండ్రాయి గ్రామాల వద్ద శనివారం కొండవీటి, మేళ్లవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మేళ్లవాగు ఉధృతి ఎక్కువగా ఉండటంతో శుక్రవారం రాత్రి నుంచి అమరావతి, నరుకుళ్లపాడు, పెదమద్దూరు గ్రామాలలో కొంతమేర పత్తిచేలు నీటమునిగాయి. అలాగే మండల పరిధి గ్రామాలలో కురుస్తున్న భారీవర్షాలకు వాగులు, కుంటల్లో వర్షపునీరు నిండి పోవటంతో పల్లపు ప్రాంతాలలోని సాగు భూముల్లో నీరు నిలిచింది. ఇలాగే మరో రెండు రోజులు వర్షం కొనసాగితే పంటలు పూర్తిగా నీట మునిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా జేసీగా సూరజ్ ధనుంజయ్



నరసరావుపేట: పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి గనోరే సూరజ్ ధనుంజయ్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి నిర్వహించిన రాష్ట్రవ్యాప్త ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఆయన ఇక్కడకు రానున్నారు. ప్రస్తుతం ఆయన ఐటీడీఏ రంపచోడవరం ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. గతంలో జేసీగా పనిచేసిన ఎ.శ్యాంప్రసాదు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన విషయం విదితమే.

గుంటూరు జేసీగా భార్గవ్ తేజ



గుంటూరు వెస్ట్ : గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా అమిలినేని భార్గవ్‌తేజను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఇప్పటి వరకు కర్నూలు మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. గతంలో గుంటూరు జేసీగా పనిచేసిన రాజకుమారి నంద్యాల జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన సంగతి విదితమే. 2018 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన భార్గవ్ తేజ త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నారు.

గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్‌గా దినేష్‌కుమార్



నెహ్రూనగర్: గుంటూరు నగర కమిషనర్‌గా 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కొత్తమాసు దినేష్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం 62 మంది ఐఏఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన్ను గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా బదిలీ చేసింది. ప్రస్తుతం ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న కీర్తి చేకూరిని ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు.

శాకంబరీ దేవి.. శరణు శరణు



శాకంబరి దేవికి పూజలు చేస్తున్న అర్చకుడు



అమ్మవారికి సారె సమర్పించిన మహిళలు

విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శాకంబరీదేవి ఉత్సవాలు రెండో రోజు శనివారం వైభవంగా జరిగాయి. ఉపాలయాల్లో కొలువై ఉన్న దేవతామూర్తులను సైతం కూరగాయలతో అలంకరించారు. అదేవిధంగా ఆషాఢ మహోత్సవాల నేపథ్యంలో ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. – ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)

విద్యాశిక్షణ పరివారం


- ప్రభుత్వ పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్'
- రేపటి నుంచి 28 వరకు ప్రత్యేక వారోత్సవాలు

సత్తెనపల్లి/ నరసరావుపేట ఈస్ట్: కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)– 2020 ప్రవేశపెట్టి నాలుగేళ్ల పూర్తవుతున్న సందర్భంగా వార్షికోత్సవంలో భాగంగా ఈనెల 22 నుంచి 28వ తేదీవరకు వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో శిక్ష సప్తాహ్ (విద్యావారం) కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.

వారం రోజుల కార్యక్రమాలు ఇలా..

- **ఈనెల 22న స్థానిక వనరులతో బోధన సామగ్రి ప్రదర్శన:** ఉపాధ్యాయులు స్థానికంగా లభించే వనరులతో తయారు చేసిన బోధనా అభ్యాసన సామగ్రి తయారుచేసి ప్రదర్శించాల్సి ఉంటుంది. దీనికి విద్యార్థులు తల్లిదండ్రులతో పాటు స్థానిక పెద్దలను ఆహ్వానించాలి.
- **23 పునాది అభ్యాసన కార్యక్రమం:** ఒకటో తరగతి నుంచి భాషపై పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం, గణితంలోని సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి విజయవంతంగా అమలు చేయడానికి సమాజ భాగస్వాములకు చర్చ ద్వారా అవగాహన కల్పించాల్సి ఉంది.
- **24 క్రీడా దినోత్సవం:** వివిధ క్రీడాంశాలపై పోటీలు నిర్వహించడం, శారీరక సౌష్టవం ప్రాముఖ్యతను తెలియజేసేలా ఈ పోటీలు ఉండాలి.
- **25 సాంస్కృతిక దినోత్సవం:** విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించేలా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి.
- **26 సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం:** స్కిల్, డిజిటల్ ఇనిషియేటివ్‌డేలో భాగంగా ప్రస్తుత ఉద్యోగావకాశాల నేపథ్యంలో తరగతి గది అనుభవాలను మెరుగుపరచడానికి డిజిటల్ కార్యక్రమాలకు అవసరమయ్యే నూతన నైపుణ్యాల అవసరాన్ని గుర్తించడం, విద్యలో సాంకేతిక అభివృద్ధిని గుర్తించేలా చర్చించడం.
- **27 పర్యావరణ పరిరక్షణ దినోత్సవం:** మిషన్ లైఫ్ యాక్టివిటీస్.. పాఠశాలల్లో న్యూట్రిషన్ డే, పాఠశాలల్లో కొత్త ఏకో క్లబ్‌ల ఏర్పాటు, విద్యార్థులు, తల్లులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి అమ్మ పేరుతో అమ్మతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం.
- **28 సామాజిక భాగస్వామ్య దినోత్సవం:** ప్రజలు, తల్లిదండ్రుల కమిటీలు, ఉపాధ్యాయ సంఘాల సహకారాన్ని పెంపొందించడం, నైపుణ్యాభివృద్ధికి పర్యావరణ వ్యవస్థను అందించడం అంటే పుట్టినరోజులు, ప్రత్యేక సందర్భాల్లో భోజనాలు నిర్వహించడం, పాఠశాల విద్యార్థులతో కలిసి స్థానిక పెద్దలు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనం చేయడం.

శిక్షా సప్తాహ్ విజయవంతం చేయాలి



ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 22 నుంచి 28 వరకు శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా నిర్వహించాలి. సంబంధిత ఫొటోలతో కూడిన డాక్యుమెంటేషన్ నమోదు చేయాలి. జిల్లాల్లోని ఉప విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్షా సెక్టోరియల్ ఆఫీసర్స్, ఎంఈఓలు బాధ్యత వహించాలి.

– ఎం.వెంకటేశ్వర్లు, డీఈఓ, పల్నాడు

రహదారి భద్రతపై అవగాహన కల్పించండి

- జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు
- పట్టణ, రూరల్ పోలీసుస్టేషన్లలో ఆకస్మిక తనిఖీ



ఒకటో పట్టణ స్టేషన్ తనిఖీ చేసి వెళ్తున్న ఎస్పీ శ్రీనివాసరావు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

నరసరావుపేట: డ్రంకెన్ డ్రైవ్, రహదారి భద్రతా నియమాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఒకటి, రెండో పట్టణ పోలీసుస్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. శనివారం రాత్రి పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీసుస్టేషన్లను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ సమయంలో పోలీసుస్టేషన్లలో ఉన్న పౌరులను వారు ఎందుకు స్టేషన్‌కు వచ్చారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మహిళా ఫిర్యాదుదారులకు వెయిటింగ్‌రూమ్ ఉండాలని స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలు కృష్ణారెడ్డి, భాస్కర్, మల్లికార్జునరావులకు సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న వాహనాలను త్వరగా డిస్పోజ్ చెయ్యాలని ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. 174 సీఆర్‌పీసీ కేసుల రికార్డులను పరిశీలించారు. సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో గల పాఠశాలలు, హోటళ్లు లాంటి ప్రదేశాలలో నిఘా ఏర్పాటు చేయాలని, ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, సమర్థవంతమైన నేర నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు కృషిచేయాలన్నారు. నేరాల అడ్డుకట్టకు నైట్‌బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్పీ సూచించారు.

కష్టాల కల'నేత'

- వానలతో నేతన్నలకు అవస్థలు
- మగ్గాల్లోకి చేరిన నీరు
- ముందుకు కదలని చేనేత మగ్గాలు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం



భట్టిప్రోలులో మగ్గం గుంతలోకి చేరిన నీటిని తోడుతున్న నేతన్న

భట్టిప్రోలు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో చేనేత వాడల్లో మగ్గాల సవ్వడి మూగబోయింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు చేనేత చతికిలపడింది. కార్మికులు ఉపాధి కోల్పోయారు. మగ్గం ఆడితే గానీ డొక్కాడని బతుకులు అవస్థలు పడుతున్నాయి. వర్షాలకు మగ్గాల గుంతల్లోకి నీరు చేరింది. దీంతో చేనేత అనుబంధ పనులు కూడా స్తంభించి పోయాయి. నేతన్నలు పనుల్లేక దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు. నేత కార్మికులతో పాటు నూలు, పడుగు, మరాసు తదితర ఉప వృత్తులు చేసే వారు కూడా ఉన్నారు. మగ్గాల్లోకి నీరు చేరడంతో నేత నేసే అవకాశం లేకపోయింది. చేతిలో చిల్లిగవ్వ లేక కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారింది.

మూగబోయిన మగ్గాల సవ్వడి

భట్టిప్రోలు మండలంలో అద్దేపల్లి, ఐలవరం, భట్టిప్రోలు, కోనేటిపురం ప్రాంతాల్లో 500 మగ్గాలు నడుస్తున్నాయి. సుమారు వెయ్యి కుటుంబాలు చేనేత పరిశ్రమనే నమ్ముకుని జీవిస్తున్నారు. ప్రతి చేనేత మగ్గంపై 10 మంది అనుబంధ కార్మికులు పని చేస్తున్నారు. ఎక్కువ శాతం గుంత మగ్గాలు కావడం వల్ల నేతకు వాతావరణం అనుకూలించదు. స్టాండ్ మగ్గాలైతే కొంతమేర ఫర్వాలేదు. పనులు లేకపోవడంతో చేనేత కార్మికులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. మగ్గాల్లో నేత దిగినప్పటికీ మొల కట్టుకునేందుకు వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో అయోమయ స్థితిలో ఉన్నారు. మగ్గాలపై ఉన్న నేత అలాగే ఉంటే పాడైపోతుందని కార్మికులు వాపోతున్నారు. ముసురు వల్ల పని లేక చేనేత కార్మికులు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

గోలిలో రూ.2.20 కోట్లతో పీహెచ్‌సీ నిర్మాణం

గ్రామంలో స్థలాన్ని పరిశీలించిన ప్రత్యేకాధికారి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి టి.సత్యనారాయణ శర్మ, ఎంపీడీఓ శంకరరావు

గోలి(రెంటచింతల): మండలంలోని గోలి గ్రామంలో రూ.2.20 కోట్లతో పీహెచ్‌సీ నిర్మాణం చేపడుతున్నట్లు జిల్లా భూగర్భజలవనరుల అధికారి, మండల ప్రత్యేక అధికారి టి.సత్యనారాయణ శర్మ తెలిపారు. పల్నాడు జిల్లా కలెక్టర్ బి.అరుణకుమార్ ఆదేశాల మేరకు శనివారం ఎంపీడీఓ పెదప్రోలు శంకరరావుతో కలిసి గ్రామంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో వైద్యాధాకారులు, స్థానిక ప్రజా ప్రతినిధులను కలిసి పీహెచ్‌సీ నిర్మాణ పనుల ప్రారంభంపై మాట్లాడారు. మారుమూల గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పీహెచ్‌సీ నిర్మాణం తలపెట్టినట్లు వెల్లడించారు. సర్పంచ్ మున్నా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇప్పటికే గ్రామంలోని సచివాలయం సమీపంలోని 1.50 ఎకరాల భూమిని పరిశీలించినట్లు తెలిపారు. స్థానిక పరిస్థితులపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు ప్రత్యేక అధికారి తెలిపారు. ఆయన వెంట వైద్యాధికారులు వి.ప్రదీప్‌కుమార్ రెడ్డి, హేమ, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, గ్రామ పెద్దలు ఉన్నారు.

క్లుప్తంగా

కడప - విశాఖ మ్యాచ్ డ్రా

తొలి ఇన్నింగ్ ఆధిక్యంతో విశాఖకు 3 పాయింట్లు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్-16 బాలుర క్రికెట్ పోటీలలో భాగంగా వైఎస్సార్ కడప, విశాఖపట్నం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. వర్షాలతో మూడు రోజుల పాటు కొనసాగాల్సిన మ్యాచ్ తొలి రోజుకే పరిమితమయింది. కాగా తొలిరోజు కడప జట్టు 52 పరుగులకే కుప్పకూలగా, విశాఖ జట్టు 4 వికెట్లు నష్టపోయి 148 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 96 పరుగులు సాధించిన విశాఖ జట్టుకు 3 పాయింట్లు, కడప జట్టుకు ఒక పాయింట్ లభించింది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో పార్శిల్ లారీ డ్రైవర్ మృతి

మృతుడు గుంటూరు రూరల్ మండలం పెదపలకలూరు వాసిగా గుర్తింపు


మృతుడు పగిడిపల్లి నవీన్

యడ్లపాడు: జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న వాహనాన్ని వెనుకగా మరో వాహనం ఢీకొనడంతో పార్శిల్ లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా పెదపలకలూరు గ్రామానికి చెందిన పగిడిపల్లి నవీన్(23) ఓ పార్శిల్ కంపెనీకు చెందిన లారీకి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన విధుల్లో భాగంగా పామర్రు ప్రాంతంలో పార్శిల్ లోడును దించి తిరిగి గుంటూరుకు బయలు దేరాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో స్థానిక ఎర్రకొండ సమీపంలో 16 నంబర్ హైవే వంతెన వద్ద గుంటూరు వైపు ప్రయాణిస్తున్న వాహనాన్ని వెనుక నుంచి పార్శిల్ లారీ ఢీకొంది. దీంతో తీవ్రగాయాలై అపస్మారక స్థితికి వెళ్లిన డ్రైవర్ నవీన్‌ను హైవే అంబులెన్స్‌లో చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నవీన్ తల్లి మల్లేశ్వరి ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ జె.శామ్యూల్ రాజీవ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

బాపట్ల జిల్లా జేసీ బి. సుబ్బారావు

పాతనందాయపాలెం(కర్లపాలెం): గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని బాపట్ల జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. ఆయన శనివారం పాతనందాయపాలెం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సుమోటో కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు, మరణాల వివరాల్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందే విధంగా కృషి చేయాలని చెప్పారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మలానందబాబా ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వో శివనాగరాజు, కార్యదర్శి మురళి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్


ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్, ఏపీడీ నారాయణ

ముప్పాళ్ల: ఉపాధిహామీ పథకం సిబ్బంది రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జోసఫ్‌కుమార్ చెప్పారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉపాధిహామీ పథకం 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సోషల్ ఆడిట్‌లో భాగంగా ప్రజావేదిక శనివారం జరిగింది. మండలంలో 14 గ్రామపంచాయతీలకు గాను 429 పనులకు ఖర్చు చేసిన రూ.6కోట్ల17లక్షల42వేల697 నిధులపై గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత ఉపాధి హామీ సిబ్బందిపై ఉందని పీడీ జోసఫ్‌కుమార్ చెప్పారు. పని ప్రాంతంలో ఉండి మస్టర్‌షీట్‌ల నిర్వహణ జాగ్రత్తగా చేపట్టాలన్నారు. జాబ్‌కార్డులన్నీ పూర్తిస్థాయిలో అప్‌డేషన్ చేయాలన్నారు. మస్టర్‌షీట్‌లో కొట్టివేతలు లేకుండా చూసుకోవాలన్నారు. పనికి వచ్చిన వ్యక్తి హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. వారి వేలిముద్రలు, సంతకాలు మస్టర్‌షీట్‌లో ఉండాలన్నారు. ప్రజావేదికలో భాగంగా పలు గ్రామాల్లో మస్టర్‌షీట్‌లో వేలిముద్రలు, సంతకాలు కూలీలకు వేతనాలు అందించినట్లుగా గుర్తించామని, వారి వద్ద నుంచి చెల్లించిన కూలీ వేతనాన్ని రికవరీ చేయాలన్నారు. రికార్డులు నిర్వహణ కూడా సక్రమంగా లేనట్లుగా గుర్తించామన్నారు. ప్రజావేదికలో ఎంపీడీఓ శ్రీకృష్ణ, ఎంఎస్ఆర్ఈజీఎస్ ఏపీడీ పీవీ నారాయణ, విజిలెన్స్ సిబ్బంది విజయకుమారి, క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది ప్రభాకర్, ఏపీఓ జి.ఏడుకొండలు, ఎస్ఆర్పీ లోకేష్, సోషల్ ఆడిట్ బృందం సభ్యులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌పై సమగ్ర చర్చ జరగాలి

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయిలో ఎన్‌సీఈఆర్టీ ద్వారా రూపొందించిన సిలబస్‌పై సమగ్ర చర్చ జరపాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. గుంటూరులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన యూటీఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రకృతి వనరులను ఉపయోగించుకుని, సుఖవంతమైన జీవనం పొందే పౌరులను తయారు చేయడం విద్య లక్ష్యం అని తెలిపారు. ఈ లక్ష్య సాధన కోసం ప్రతి రాష్ట్రంలో ఎన్‌సీఈఆర్టీని స్థాపించారని చెప్పారు. దీని ద్వారానే స్థానిక చరిత్ర, భౌగోళిక పరిస్థితులు, స్థానిక వనరులు, శీతోష్ణ స్థితి, వ్యవసాయం తదితర రంగాలపై విద్యార్థులకు ఒక సమగ్ర అవగాహన పెంపొందించే విధంగా పాఠ్యాంశాలను రూపొందించేవారని తెలిపారు. గత ఐదేళ్లుగా ఎన్‌సీఈఆర్టీని మరుగున పరిచి అంతర్జాతీయ విద్యార్థిని తయారుచేయడం లక్ష్యంగా ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను ప్రవేశపెట్టారని చెప్పారు. ఎటువంటి చర్చ లేకుండా ఎన్‌సీఈఆర్టీ సిలబస్ అమలు చేయడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌పై ఒక సమగ్ర చర్చ జరపాలని కోరారు. ప్రచురణల విభాగం రాష్ట్ర చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ 117 జీవోను రద్దు చేసి, ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియంలు ప్రవేశపెట్టడంతోపాటు ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదు తరగతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ మాట్లాడుతూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్థాపించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా స్వర్ణోత్సవాలు జరగబోతున్నాయని, వీటిని జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఏ.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు గోవిందు, కె.ప్రేమ్‌కుమార్, ఎం.కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శవ దహనానికి కర్రల తరలింపు అడ్డగింత

- అధికారులు వెళ్లినా ఫలితం లేక మరో మార్గంలో తరలింపు
- వేలూమూరిపాడులోని ధేనువకొండ పునరావాస కాలనీలో ఘటన


అధికారుల కోసం ఎదురు చూస్తున్న ధేనువకొండ కాలనీ వాసులు

అద్దంకి: మృతురాలి శవ దహనానికి ఉపయోగించే కట్టెలను తమ రహదారి నుంచి తరలించడానికి వీల్లేదని ఓ కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈ ఘటన బాపట్ల జిల్లాలోని అద్దంకి మండలంలోని వేలమూరిపాడు ఎస్సీ కాలనీలో శనివారం జరిగింది. ధేనుకొండ పునరావాస కాలనీవాసులు రామిరెడ్డి ఆదిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ధేనువకొండ గ్రామ (గుండ్లకమ్మ డ్యామ్) పునరావాసులకు వేలమూరిపాడు గ్రామ సమీపంలో కాలనీ కేటాయించారు. అందులో వారు ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నారు. కాలనీలో మృతి చెందిన వారి అంత్యక్రియలు చేయడానికి శ్మశానం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. తీరా అధికారులు దూరంగా వేలమూరిపాడు ఎస్సీ కాలనీకి దిగువ ప్రాంతమైన గుండ్లకమ్మ నదీ పరీవాహక ప్రాంతంలో శ్మశానానికి స్థలాన్ని కేటాయించారు. దీనికి వేమూరిపాడు ఎస్సీ కాలనీలోని రహదారి నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కాలనీలోని రామిరెడ్డి పెద అంజమ్మ (85) శనివారం మృతి చెందగా కర్రల్ని వేలమూరిపాడు ఎస్సీ కాలనీ రహదారి నుంచి తరలిస్తున్న క్రమంలో నివాసితులు అడ్డుకున్నారు. తమకు అశుభం అంటూ అడ్డు చెప్పారు. సమస్యను స్థానిక తహసీల్దారు సుభానీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వీఆర్వోతో అక్కడ వెళ్లి సర్ది చెప్పబోయినా ససేమిరా అన్నారు. చేసేది లేక దూరంగా ఉండే మరో మార్గాన్ని ఎంచుకుని అటునుంచి కర్రల్ని తరలించారు. ధేనుకొండ పునరావాస కాలనీకి రహదారి సమస్యను త్వరలో పరిష్కరిస్తానని, వేరే మార్గాన్ని కేటాయిస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారు.

బీఎస్ఎన్ఎల్ ఆఫీసులో చోరీకి యత్నం

- నలుగురు యువకుల్లో ముగ్గురు పరార్
- ఒకరు స్టేషన్‌కు తరలింపు

పెదపులివర్రు(భట్టిప్రోలు): బీఎస్ఎన్ఎల్ ఆఫీసులో దొంగతనం చేసేందుకు వచ్చిన యువకుల్లో ఒకరిని స్థానికులు చాకచక్యంతో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. భట్టిప్రోలు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. భట్టిప్రోలు మండలం పెదపులివర్రు బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో శనివారం చోరీ చేసేందుకు తెనాలి నుంచి ఆటోలో నలుగురు యువకులు యత్నించారు. ఆఫీసు తాళాలు ఇవ్వమని, తాము చెక్ చేసేందుకు వచ్చామని చెప్పారు. అనుమానం వచ్చిన యజమాని రేపల్లె ఆఫీసుకు ఫోన్ చేయగా వచ్చిన వారు తమ వారు కాదని చెప్పడంతో అప్రమత్తమయ్యారు. స్థానికులు వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా ముగ్గురు పరారయ్యారు. ఒక యువకుడిని పట్టుకుని ఆటోలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆఫీసులోకి ఎందుకు వెళ్లారనే విషయంపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. సమాచారాన్ని వేమూరు సీఐ పి. రామకృష్ణకు తెలియజేశారు. ఆటోలో గోతాలు, ఇనుప కడ్డీలు ఉన్నట్లు గుర్తించారు. ఆఫీసు తాళాలు ఎక్కడ ఉంటాయో తెలిసిన వాళ్లే ఈ చోరీకి పాల్పడినట్లు

పిట్టగోడ పైనుంచి పడి వ్యక్తి మృతి



రేపల్లె రూరల్: ప్రమాదవశాత్తు డాబా పిట్టగోడ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని రింగు రోడ్డులో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని 5వ వార్డుకు చెందిన ఉమామహేశ్వరరావు (59) రింగు రోడ్డు సెంటరులో దుకాణం నిర్వహిస్తున్నాడు. శనివారం వర్షం పడుతుండటంతో దుకాణంపై పట్టా కప్పేందుకు పిట్టగోడ ఎక్కి ప్రమాదవశాత్తు కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, ఉమామహేశ్వరరావు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని పట్టణ ఎస్ఐ హరిబాబు తెలిపారు. గ్రామస్తులు అనుమాన వ్యక్తం చేస్తున్నారు.

హెల్మెట్ రహిత ప్రయాణం ప్రమాదకరం

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కుమారస్వామి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

పిడుగురాళ్ల: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కుమారస్వామి తెలిపారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో మోటార్ వాహనాల చట్టాలపై అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని శనివారం పిడుగురాళ్ల మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి మురళీ గంగాధరరావు ఆదేశాల మేరకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. వాహనచోదకులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. అనంతరం ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, ప్రజలకు మోటార్ వాహనాల చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బార్ అసోసియేషన్ సభ్యులు కోవూరి వెంకటేశ్వర్లు, న్యాయవాది మందా జాకబ్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

పత్తిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పత్తిపొలాలను పరిశీలించిన డీఏఓ మురళి


ఎర్రబాలెంలో పత్తిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, ఏఓ వేణుగోపాల్

ఎర్రబాలెం(క్రోసూరు): మండలంలోని ఎర్రబాలెం గ్రామంలో పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) ఐ.మురళి శనివారం ఏఓ వేణుగోపాల్‌తో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా స్థానిక పత్తి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందుకు పత్తిపైరులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. పత్తిపంట ప్రస్తుతం 30-40 రోజుల దశల్లో ఉన్నట్లు తెలిపారు. వర్షాలు ఏకధాటిగా కురుస్తుండటంతో పంట పొలాల్లో నీళ్ల నిలబడే అవకాశాలున్నాయని, వాటిని చిన్న చిన్న కాలువలు చేసి బయటకు పంపించేయాలని సూచించారు. పైరు ఎదుగుదలకు ఉపయోగపడే విధంగా ఎరువులను బూస్టర్ డోస్‌గా వినియోగించుకోవాలన్నారు. వాతావరణంలో అధిక తేమశాతం ఉన్నందున తెగుళ్ల ఉధృతి ఉంటుందని, వాటి నివారణకు లీటరు నీటికి ప్లాసికోనజోల్ 1 మిల్లీలీటరు, లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే మొక్కల మధ్య అంతర సేద్యం వలన తేమ త్వరగా ఆరిపోయి మొక్కలు కోలుకుంటాయన్నారు. వ్యవసాయ సహాయకులు సందీప్‌కుమార్, గోపీకృష్ణ, పవన్‌కుమార్, పాల్గొన్నారు.

వేల్పూరులో...

అచ్చంపేట: ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి పత్తి చేనులో అధిక తేమ లేకుండా చూసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి సూచించారు. పొలాల్లో నీరు నిలవకుండా వెంటనే బయటకు పంపాలన్నారు. మండలంలోని వేల్పూరులో శనివారం ఆయన పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం పత్తి మొక్కలు ప్రారంభదశలో ఉన్నాయని, అధిక తేమ ఉంటే మొక్కలకు తెగుళ్లు సోకే అవకాశాలున్నట్లు చెప్పారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసిన దుకాణం నుంచి తీసుకున్న బిల్లును పంటకాలం పూర్తి అయ్యేంతవరకు భద్రపరచుకోవాలని చెప్పారు. దిగుబడి రాకుంటే పరిహారం కోరే అవకాశం ఉంటుందని వివరించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి పి.వెంకటేశ్వర్లు, సిబ్బంది మాన్యనాయక్, పత్తి రైతులు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో ఎనిమిది మంది అరెస్టు


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న తుళ్లూరు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ, సీఐ దార్ల జయకుమార్

మేడికొండూరు: పేరేచర్లలో జరిగిన హత్యాయత్నం కేసులో ఎనిమిది మందిని శనివారం మేడికొండూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మేడికొండూరు పోలీసుస్టేషన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తుళ్లూరు డీఎస్పీ వి.అశోక్‌కుమార్‌గౌడ వివరాలు వెల్లడించారు. ఇటీవల జరిగిన పీర్ల పండుగ సందర్భంగా డీజే సౌండ్స్ ఏర్పాటు చేశారు. వాటి ధర విషయంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు ఘర్షణ పడ్డారు. ఘర్షణలో షేక్ జాన్‌సీరాపై మారణాయుధాలతో హత్యాయత్నం చేశారు. కేసుకు సంబంధించి ఎనిమిది మంది నిందితులు షేక్ కరీముల్లా, షేక్ ఘన్ సైదా, షేక్ మర్రిపాలెం సుభాని, షేక్ మర్రిపాలెం గనిసాహెబ్, షేక్ మర్రిపాలెం కరీముల్లా, షేక్ మర్రిపాలెం షాబాజ్, షేక్ మర్రిపాలెం అబ్రహ్మద్, షేక్ మర్రిపాలెం ఆసీఫ్‌లను జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, తుళ్లూరు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ ఆదేశాల మేరకు తెల్ల క్వారీ సమీపంలో ఎస్సై వాసు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

సుభానిపై పీడీ యాక్ట్

పేరేచర్లలో జరిగిన హత్యాయత్నం కేసులో రౌడీషీటర్ షేక్ మర్రిపాలెం సుభాని నిందితుడు కావడంతో అతని మీద పీడీ యాక్ట్ కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్ తెలిపారు. పీడీ యాక్ట్ ద్వారా ఆరు మాసాల వరకు బెయిల్ రాదని చెప్పారు. రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు రాకుంటే వారి ఆస్తులు జప్తు చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామన్నారు. రౌడీషీటర్లు జాగ్రత్తలు పాటించి, వివాదాల జోలికి వెళ్లకుండా ప్రవర్తనలో మార్పులు తెచ్చుకుని జీవించాలన్నారు.